వైసిపికి మోటుకూరు రాజీనామా

ప్రజాశక్తి-కోటనందూరు

వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మోటుకూరి వెంకటేష్ పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఆయన రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకి పర్సనల్ సెక్రెటరీగా చేశారు. రాజాకి ప్రధాన అనుసరుడు స్నేహితుడు కావడం విశేషం. వైయస్ జగన్, షర్మిల పాదయాత్రలో 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి దాడిశెట్టి రాజాకు క్రియశీలక పాత్ర పోషించారు. కొంతకాలంగా వ్యక్తిగత కారణాలు దృష్ట్యా పార్టీ అధికార కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వ్యక్తిగత కారణాల వల్లే పదవికి పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నత్తనడకన వైఎస్ఆర్ బీమా నమోదు

ఇప్పటి వరకూ 64 శాతమే పూర్తి

నేటితో ముగుస్తున్న గడువు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రమాద సమయంలో పేద ప్రజలకు అండగా నిలుస్తున్న వైయస్సార్ బీమా నమోదు కార్యక్రమం కాకినాడ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఈ నెల 10వ తేదీతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు 64 శాతమే పూర్తయింది. సాంకేతిక సమస్యలకు తోడు నమోదు కార్యక్రమాన్ని వేగంగా చేపట్టకపోవడంతోనే లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారని సిబ్బందిపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

దారిద్రరేఖకు దిగువన ఉన్న వారందరూ వైయస్సార్ బీమా నమోదుకు అర్హులను ప్రభుత్వం చెబుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ దీని నమోదుకు గడువు ఇచ్చారు. అయితే సర్వర్ సమస్యల వల్ల రెండు మూడు రోజులు సక్రమంగా పని చేయలేదు. గ్రామ, వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శి, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నమోదు చేపట్టాల్సి ఉంది. కొన్ని సమయాల్లో ఇంటి యజమాని అందుబాటులో ఉండడం లేదు. దీంతో నమోదు నత్తనడకన సాగుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బీమా అమలు నిబంధనల్లో మార్పు చేయడంతో ఈ సమస్య ఎదురవుతోంది. గతంలో ఇంటిలో ఎవరికి ప్రమాదం జరిగినా, మరణించినా బీమా వర్తించేది. కానీ ఇప్పుడు ఇంటి యాజమానికి మాత్రమే వర్తింపజేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 18-70 ఏళ్లలోపు వారు సహజ మరణం పొందితే రూ.లక్ష, ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం పొందినా రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందజేస్తారు. 51-70 ఏళ్ల లోపు వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.3 లక్షలు చొప్పున అందిస్తారు. ప్రమాదంలో పాక్షిక వైకల్యం పొందిన వారికి రూ.2.50 లక్షలు అందజేస్తారు.

గడువు పెంచే అవకాశం ఉంది

ఈ నెల 10వ తేదీతో బీమా నమోదుకు గడువు ముగుస్తుంది. అయితే 64 శాతం మాత్రమే పూర్తయింది. సాంకేతిక సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం మరికొద్ది రోజులు గడువు పెంచే అవకాశం ఉంది.

- కె.శ్రీరమణి, డిఆర్‌డిఎ పీడీ.

గడువు ముగుస్తున్నా చేరని లక్ష్యం

నేటితో బీమా నమోదుకు గడువు ముగుస్తున్నా లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. కాకినాడ జిల్లాలో 5,83,413 మందిని అర్హులుగా గుర్తించారు. గతంలో నమోదైన 5,43,146 మందివి రెన్యువల్ చేయాల్సి ఉంది. శుక్రవారం వరకూ 3,72, 985 మందివి అంటే 64 శాతం మాత్రమే రెన్యువల్ పూర్తి అయింది. 4,0267 మందిని కొత్తగా నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 4446 మందివి మాత్రమే పూర్తి చేసారు. కాకినాడ నగరంలో 76,659 మంది వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఇంత వరకు 60 శాతం అంటే 59,466 మందివి నమోదు చేసారు. జగ్గంపేటలో 24,222 మందికి 12,752, యు.కొత్తపల్లిలో 24,624 మందికి 17,972, సామర్లకోట టౌన్‌లో 14,881 మందికి 10,914, తుని అర్బన్‌లో 12,680 మందికి 9,348, కోటనందురులో 14,271 మందికి గానూ 10,894 మందికి బీమా నమోదు కావాల్సి ఉంది. నమోదు ప్రక్రియలో భాగంగా ఇంటి యజమాని ఆధార్ నంబరు ఎంటర్ చేయగానే లింక్ అయిన మొబైల్ నెంబర్‌కు ఒటిపి వస్తుంది. చాలామంది అందుబాటులో లేకపోవడంతో నమోదుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంతమంది మొబైల్ నెంబర్ మార్చడంతో ఒటిపి రావడం లేదు. దీంతో మళ్లీ ఇకెవైసి చేయించుకోవాల్సి ఉంటుంది. పగటి వేళల్లో సర్వర్ పని చేయడం లేదని సిబ్బంది తెలుపుతున్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో ఇంకా మిగిలియున్న ఖాళీలను త్వరితగతిన భర్తీకి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. కతికాశుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఖాళీల వివరాలు, ఆసుపత్రుల్లో జరుగుతున్న నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ కతికా శుక్లా డిఆర్ఒ కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. కాకినాడ జిజిహెచ్, డిఎంహెచ్ఒ, డిఎంఇ, ఎపివివిపి విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల తక్షణ భర్తీకి చర్యలు తీసుకోవాలని కలెక్టరు అధికారులకు ఆదేశించారు. అన్ని ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, పారామెడికల్, టెక్నికల్ అసిస్టెంట్ సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు, నర్సులు, క్లినికల్ సైకాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్ తదితర ఖాళీల భర్తీకి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ ఆసుపత్రుల్లో జరుగుతున్న నిర్మాణ పనులపై ప్రత్యేక దష్టి పెట్టి సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ కతికా శుక్లా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవీ, ఉమ్మడి జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ సనత్ కుమారి, డిఐఒ డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఎంఒయు కుదుర్చుకొంటున్న విసి, ప్రతినిధులు

ఎంఒయు ద్వారా ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-కాకినాడ

ఎంఒయులతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జెఎన్టియుకె విసి జివిఆర్.ప్రసాదరాజు అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం విసి కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో కోట పట్టణంలోని పాల్కన్ ఇన్ఫో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, న్యూఢిల్లీలోని అయోటెక్ వరల్డ్ యావిగేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలతో డ్రోన్ సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ కఓసం జెఎన్టియుకె ఎంఒయు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా విసి ప్రసాదరాజు మాట్లాడుతూ ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో శిక్షణ ఇచ్చి డైరెక్టర్ జనరల్ సివిల్ ఏవియేషన్ వారి ద్వారా సర్టిఫికెట్ వచ్చే విధంగా తర్ఫీదు ఇస్తామన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా విద్యార్థులకు 10 కోర్సులలో శిక్షణ అందిస్తారని, ఈ శిక్షణ ద్వారా వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం, రెవెన్యూ, విమానయాన రంగాలకు సంబంధించిన డ్రోన్లను వినియోగించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రక్షణ రంగం, త్రీడి మోడలింగ్, భవన నిర్మాణం, రోడ్డు రవాణా, లాజిస్టిక్, పరిశ్రమలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని విసి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, యుసిఇకె ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

12 నుంచి నాటికల పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కాకినాడ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటికల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ నాటికలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను శుక్రవారం యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ (దంటు కళాక్షేత్రం)లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నాటికల పోటీలను కళాప్రియులు, సాహిత్య అభిమానులు తిలకించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన తెలుగు నాటక రంగం దినోత్సవం సందర్భంగా కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. ఈ ఆహ్వాన పత్రిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో సభ్యులు కె.కష్ణారావు, నాదెళ్ల ప్రభుదాసు, నాగిరెడ్డి సతీష్ రావు, కొర్రపాటి సౌజన్య రావు, కేదారశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌కె.మోహన్ రావు, గోపు కాశీ విశ్వనాథం, వాసంశెట్టి రవి పాల్గొన్నారు.

డెలివరీ బోయ్ నిజాయితీ

ప్రజాశక్తి కాకినాడ రూరల్

ఒక మహిళ జారవిడుచుకొన్న హ్యాండ్ బ్యాగ్‌ను తిరిగి ఆమెకు డెలివరీ బాయ్ అప్పగించి నిజాయితీని నిరూపించుకున్న సంఘటన కాకినాడ కల్పనా సెంటర్ వద్ద చోటు చేసుకొంది. ఇంద్రపాలెం గ్రామానికి చెందిన కుడిపూడి సత్యవేణి హ్యాండ్ బ్యాగ్ శుక్రవారం మోటార్ సైకిల్‌పై వస్తుండగా కాకినాడ కల్పనా సెంటర్ దగ్గర లో క్రింద పడిపోయింది. దానిలో రూ.50 వేల క్యాష్, ఒక సెల్ ఫోన్ కొన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయి. ఆ బ్యాగ్‌ను అటుగా వెళుతున్న జొమాటోలో పని చేస్తున్న కాకినాడ ఎపిఎస్‌పికి చెందిన పోసిన దినకర్ అనే వ్యక్తికి దొరికింది. ఆయన నిజాయితీగా తీసుకొచ్చి కాకినాడ సిసిఎస్ డిఎస్‌పికి బ్యాగ్ అందజేశారు. ఈ క్రమంలో బ్యాగ్‌ను పోగొట్టుకున్న సత్యవేణికి ఆ బ్యాగ్ తీసుకొచ్చిన వ్యక్తి సమక్షంలోనే డిఎస్‌పి రాంబాబు సత్యవేణికి అందజేశారు. దినకర్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

మహిళకు నగదు అందజేస్తున్న డిఎస్‌పి

ఐఐఎఫ్‌టి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

భారతీయ విదేశీ వాణిజ్య సంస్థ(ఐఐఎఫ్‌టి) శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ కతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కాకినాడ జెఎన్‌టియులో తాత్కాలిక భవనంలో భారతీయ విదేశీ వాణిజ్య సంస్థ ఏర్పాటు చేశారు. యు.కొత్తపల్లి మండలం పొన్నాడలో శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు వివిధ శాఖలతో సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో కలెక్టరు డాక్టర్ కతికా శుక్లా రెవిన్యూ, కుడా, పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక, భూగర్భ జలాలు, అటవీ, కాలుష్య నియంత్రణ మండలి, కెఎస్‌ఇజెడ్ తదితర శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన తొలి దశ అనుమతులు, ఇతర అంశాలపై సమావేశంలో కలెక్టరు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ కాకినాడ ఐఐఎఫ్‌టి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 25 ఎకరాలు కేటాయించినట్లు చెప్పారు. పొన్నాడ గ్రామంలో త్వరలోనే అత్యాధునిక సదుపాయాలతో శాశ్వత క్యాంపస్ నిర్మాణం కానున్న నేపథ్యంలో జిల్లాలో వివిధ శాఖల అధికారులు ఐఐఎఫ్‌టి అధికారులతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. వివిధ అనుమతులకు సంబంధించిన ఆయా శాఖల అధికారులు బందంగా ఏర్పడి, ఉమ్మడి తనిఖీలు నిర్వహించి వెంటనే నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టరు కతికా శుక్లా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఒఎస్‌డి బాబూరావు నాయుడు, కాకినాడ ఐఐఎఫ్‌టి సెంటర్ హెడ్ వీ.రవీంద్రసారథి, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఆర్.లావణ్య, డిపిఒ ఆర్.విక్టర్, ఎపిఇపిడిసిఎల్ ఇఇ జి.ప్రసాద్, యు.కొత్తపల్లి తహశీల్దారు జివిఎస్.ప్రసాద్, అధికారులు, పాల్గొన్నారు.

11న పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

కాకినాడ శాస్త్రి కళా ప్రాంగణంలో ఈ నెల 11న సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో రత్నాకర్ పెనుమాక రచించిన గౌతమితీరం పుస్తక పరిచయ సభ నిర్వహించనున్నారు. నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జోశ్యు కష్ణ బాబు, కాళ్లకూరి శైలజ, ఆర్ రత్నాజీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం డయల్ యువర్ కమిషనర్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటల నుండి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు 08852-242100 ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

12 నుంచి 'జగనన్నకు చెబుదాం'

సామర్లకోట మున్సిపాలిటీలో ఈ నెల 12వ తేదీ నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతిరోజు 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు 'డయల్ యువర్ కమిషనర్' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 12వ తేదీ నుంచి జగన్ అన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ల్యాండ్ లైన్ నెంబర్ 0884 - 2327326 కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చునన్నారు.

యాత్రికులకు అసౌకర్యం లేకుండా జాతర

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతర సందర్భంగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా జాతర నిర్వహించాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. శుక్రవారం స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో దేవాదాయ, పోలీసు, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్తు, రెవెన్యూ, అగ్నిమాపక, ఆర్‌టిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాతరకు వేలాదిగా యాత్రికులు తరలి వస్తారని దీన్ని దష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా పలు సమస్యలను వివరించారు. క్యూలైన్లలో గంటల తరబడి యాత్రికులు అవస్థలు పడకుండా చూడాలని, క్యూ లైన్‌లో ఉన్న వారికి మంచినీరు, వారి పిల్లలకు పాలు వంటివి అందించాలన్నారు. యాత్రికులను దష్టిలో పెట్టుకుని మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా, పారిశుధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలనిన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో జాతర అన్ని రోజులు మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని డాక్టర్ సుదీప్తి అన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి నిర్వహించే బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐ షేక్ అబ్దుల్ నబీ, ఎస్ఐ వి.సురేష్, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, ఏరియా ఆసుపత్రి డాక్టర్ సుదీప్తి, తహశీల్దారు జితేంద్ర, విద్యుత్ శాఖ ఎఇ కె.రామచంద్రరావు, ఆశాదులు, వేద పండితులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ముందస్తు సాగుతో పంటరక్షణ

ప్రజాశక్తి-కాజులూరు

ముందస్తు సాగుతో ప్రకతి వైపరీత్యాల నుంచి తప్పించుకోవచ్చని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గుత్తుల బుల్లి రాజు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో వ్యవసాయ సలహ మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తుల బుల్లిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తుగానే సాగునీరు విడుదల చేసిందని, దీని ద్వారా ప్రతి రైతూ ముందస్తుగా పొలం పనులు ప్రారంభిస్తే మూడు పంటలు పండించుకుని అధికాదాయం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. జెడ్‌పిటిసి సభ్యుడు సుబ్బారావు మాట్లాడుతూ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని దీని ద్వారా ప్రతి పథకం రైతులకు అందుతోందన్నారు. ఇప్పటికే శివారు ప్రాంతం రైతులకు సాగునీరు సైతం అందించినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అశోక్ మాత మురళి, మేడిశెట్టి రాము, అల్లాడి నరసింహమూర్తి సభ్యులు పాల్గొన్నారు.

వాలంటీర్లు మరిన్ని సేవలందించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గ్రామ, వార్డు వాలంటీర్లు ప్రజలకు మరింత నాణ్యమైన సేవలందించాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో వాలంటీర్లకు సత్కార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దొరబాబు మాట్లాడారు. ఏ ప్రభుత్వమూ అమలు చేయలేని విధంగా సచివాలయాలు వాలంటీర్ల వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రజా సేవలను అందించేందుకు వైసిపి గత నాలుగేళ్లుగా ఎనలేని సేవలు అందిస్తోందన్నారు. మరింతగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే విషయంలో వాలంటీర్లు ప్రజలకు చేరువ కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లకు ఘనంగా సత్కరించారు. బొబ్బరాడ సత్తిబాబు, గోలి వెంకట రావు, సర్పంచ్ సిహెచ్ వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు (బాబ్జి), నిడదవోలు సురేష్ రామకృష్ణ చౌదరి, అధికారులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వేసవి సెలవులు ముగించుకుని జూన్ 12న పాఠశాలలు తెరువనుండటంతో అధికారులు పరుగులు పెడుతున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో పూర్తి స్థాయి పనులు పూర్తికాక పోవడంతో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి ఎదురయ్యింది. దీంతో ఆగమేఘాలపై ఎలాగైనా పనులు పూర్తి చేయాలని కిందిస్థాయి అదికాలను పరుగులు పెట్టిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాటశాలలు తెరిచేలోపు 90 శాతం పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిఇలు, ఎఇలకు స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకటరావు అధ్వర్యంలో స్మార్ట్ సిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఒక్క రోజులోనే మూడు సమీక్షలు నిర్వహించి అధికారులను పరుగులు పెట్టేలా చేస్తున్నారు. ఇప్పటి వరకూ వదిలేసి ముడు రోజుల్లో పనులు చేయించాలంటే కత్తిమీద సామూలాంటిదని అధికారులు విసుగుంటున్నారు. నేటి నుంచి క్షేత్ర స్థాయిలో స్మార్ట్ సిటీ అధికారులు పనులు తనికీ చేసేందుకు వెళ్లాడానికి చూస్తున్నారు.

కార్టూ'నిజం'

రైతులు పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

రైతాంగం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల వ్యవసాయ అధికారి ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి సునీత మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులందరూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు మాట్లాడుతూ తొలకరిలో రైతులందరూ వెదజల్లు, బెంగాల్ ఊడుపు, నారుమళ్లు అన్నీ జూలై 15 లోపు పూర్తి చేసినట్లయితే నవంబర్ నెలలో వచ్చే తుపానుల నుంచి పంట నష్టం కలుగకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. ముందస్తుగా పంటలు వేసినట్లయితే ఈ సంవత్సరంలో తొలకరి, దాళ్వాతో పాటు మూడో పంట అపరాలు (మినుము, పెసర, పచ్చిరొట్ట ఎరువులు) సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సీజన్ నుంచి ఆర్‌బికెల్లో నానో యూరియా, భాస్వరం ఎరువులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. డిఆర్‌సి కె.మాధవి మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో సమీకత వ్యవసాయ క్షేత్రం మోడల్ విధానం ద్వారా రైతులకు వరితో పాటు చేపలు, కోళ్ల పెంపకం, పండ్ల సాగు, ఆకు మరియు కూరగాయల సాగుతో సంవత్సరానికి దాదాపు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని అన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రశాంతి మాట్లాడారు. ఈ సమావేశంలో ఎఎబి చైర్మన్లు పి.రామకష్ణ, ఎ.శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్.చంద్రరావు, సుంకరపాలెం, కె.రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జెడి

నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

భానుడు తీవ్ర ప్రతాపం చూపడంతో శుక్రవారం సామర్లకోట తదితర ప్రాంతాల ప్రజలు వేసవి తాపంతో అల్లాడిపోయారు. ఉదయం 7 గంటల నుండి ఎండ వేడిమి బాగా పెరగడం దానికి తోడు విపరీతమైన వడగాలులు వీయడంతో ప్రజలు తీవ్రంగా తల్లడిల్లారు. రాత్రి 7 గంటల వరకూ కూడా వేడి తీవ్రత తగ్గలేదు. ఎండ తీవ్రత అధిక ఉష్ణోగ్రతలకు ఉక్కుపోత వాతావరణానికి ప్రజలు తీవ్రంగా తల్లాడిల్లారు. ఇక చిన్నారులు, వద్ధుల అవస్థలు చెప్పనక్కర్లేదు. దీంతో రోడ్లపై జనసంచారం లేక రోడ్ల నిర్మానుష్యంగా తయారయ్యాయి. శుక్రవారం సామర్లకోటలో 43 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రయాణాలు సాగించే పలువురు వాహన దారులు శీతలపానీయాల సెంటర్ల వద్దకు క్యూ కట్టారు. మరోవైపు దుకాణదారులు తమ వ్యాపారాలను మూసివేశారు. జన సంచారం లేక రోడ్లన్నీ వెలవెలబోయాయి. ఒకవైపు రుతుపవనాలు కేరళను తాకాయన్న వార్తలు వెలువడినప్పటికి ఎండల వేడిమి కొనసాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పని పరిస్థితి. మరోవైపు అప్రకటిత కరెంటు కోతలు కూడా ప్రజల సహనాన్ని పరీక్షించాయి.

సామర్లకోట-కాకినాడ రోడ్డు

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగు నీరును ప్రవహించేలా చూడాలని కమిషనర్ రావిరాల రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎంహెచ్ఒ, ఇఇ, ఎఇలతో కలిసి పారిశుధ్య పనులను ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డు, రైల్వే క్రాసింగ్, సూర్యనారాయణపురం ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగునీరు ప్రవహించే అవుట్‌ఫాల్ వద్ద చెత్త ప్లాస్టిక్ వాటర్ బాటిల్ రెండు రోజుల్లో శుభ్రం చేయాలని ఎటువంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పమన్నారు.

దేశభక్తి గీతాలపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు ప్రముఖ గాయని భళ్లమూడి నాగమణి దేశభక్తి గీతాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, జీవ వైవిద్య పరిరక్షణలో మొక్కలు, పక్షులు, జంతువుల రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - మామిడికుదురు, రాజమహేంద్రవరం

మామిడికుదురులో గోకవరపు శ్రీనివాసరావు ఇంట్లో 700 కేజీలు బియ్యం శుక్రవారం అధికారులు సీజ్ చేశారు. 17 సంచుల్లో ఉన్న బియ్యన్ని సీజ్ చేశామని విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి కె.కుమార్ తెలిపారు. వీటి విలువ రూ.28 వేలు ఉంటుందన్నారు. వీరిపై నమోదు చేశామన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కాతేరు గ్రామంలో గామన్ బ్రిడ్జ సమీపంలో ఒక వాహనంలో పిడిఎస్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు వాహనాన్ని సీజ్ చేశారు. వాహనంలో సుమారు 27.50 కింటాళ్ళ పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనం యజమాని ఏలూరు జిల్లాకు చెందిన కొట్టు రాజబాబు, డ్రైవర్ దాసరి సుబ్బారావు ఈ బియ్యాన్ని కుక్కునూరు నుండి కాకినాడ జిల్లాలోని పెద్దాపురానికి సరైన బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె.కుమార్ మాట్లాడుతూ ఎవ్వరైనా పిడిఎస్ బియ్య కొనడం, అమ్మడం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్స్పెక్టర్ సత్యకిషోర్, తహశీల్దార్ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్ పాల్గొన్నారు.

మలేరియాను అరికట్టేందుకు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ఉంగ్రాజవరం

ప్రతి ఒక్కరూ మలేయా అరికట్టేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని, జున్ నెల మొత్తం మలేరియా నివారణ మాసోత్సవం గా నిర్వహిస్తామని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉంగ్రాజవరం పిహెచ్సి, గ్రామ సచివాలయం పరిధిలోని ఏరియాలో ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాక్టివిటీస్ ను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియాను వ్యాప్తిచేసే ఎనాఫిలస్ దోమ కూడా నిలకడగా ఉన్న నీటిపై గుడ్లు పెడుతుందని, ఇవి 8 నుంచి 10 రోజులలో దోమలు గా మారతాయని, ఇవి రాత్రిపూట కుడతాయన్నారు. ప్లాస్మోడియం పరాన్నజీవి తో సంక్రమణం చెందిన ఈ ఎనాఫిలస్ ఫిమేల్ దోమలు కుట్టడం వలన మలేరియా వస్తుందన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే గా పాటించాలని. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వెంకటరాజు, గ్రామ ఆరోగ్య కార్యదర్శి మేరీ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర..

- ప్రైవేటు కళాశాలల్లో అరకొర సౌకర్యాలే
- న్యాక్ గుర్తింపు తప్పనిసరి అని ఆదేశాలు
- యజమాన్యాల్లో ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పలు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు సమస్యల నడుమ చదువులు సాగిస్తున్నారు. అటు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో సైతం నిబంధనలను పక్కన పెడుతున్నారు. అరకొర సదుపాయాలు నడుమ విద్యార్థులు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యలో నాణ్యత పెంచి నైపుణ్యమైన మానవ వనరుల అభివద్ధి చేయాలని విశ్వవిలయాల నిధుల మంజూరు సంస్థ (యుజిసి) లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా దేశంలో ఉన్నత విద్య అందిస్తున్న విద్యాసంస్థలన్నీ తప్పనిసరిగా జాతీయ మదింపు, గుర్తింపు సంస్థ (న్యాక్) గుర్తింపు పొందాలని యుజిసి, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ) మార్గదర్శకాలు జారీ చేశాయి. రానున్న కాలంలో డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు తప్పనిసరిగా ఈ గుర్తింపు పొందాలని లేకుంటే ఆయా కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది.

అసౌకర్యాల చెరలో కళాశాలలు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 410 డిగ్రీ ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలు ఉన్నాయి. వీటిలో కేవలం 42 మాత్రమే న్యాక్ గుర్తింపు పొందాయి. మిగిలిన కళాశాలలు అసౌకర్యాల చెరలో కొట్టుమిట్టాడుతుండగా గుర్తింపుకు దూరంగా ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో సైతం మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. సెట్, నెట్ లలో క్వాలిఫై అయిన అధ్యాపకులను మాత్రమే నియమించాలి. కానీ పలు కళాశాలల్లో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులే బోధిస్తున్నారు. 80 శాతం రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సరైన ల్యాబ్‌లు, లైబ్రరీలు అందుబాటులో లేవు. మరుగుదొడ్ల కొరత వేధిస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కాకినాడలోని పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి, రెండు, మూడేళ్లలో అన్ని గ్రూపుల్లో 3,500 మంది చదువుకుంటున్నారు. ఇక్కడ సరిపడా తరగతి గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులు లేరు. మరుగుదొడ్లు, ల్యాబ్స్, లైబ్రరీ, త్రాగునీరు సమస్యలున్నాయి. కాకినాడ, పిఠాపురం, పెద్దాపురం, తుని వంటి ప్రాంతాల్లో పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో సైతం ఇరుకు గదుల్లోనే బోధన సాగిస్తున్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు ఎక్కడా లేరు. ల్యాబ్ సౌకర్యం లేకుండానే విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారు. నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా ఆయా యాజమాన్యాలు సౌకర్యాలు పట్ల కనీస శ్రద్ధ చూపలేకపోతున్నాయి. కాకినాడ జిల్లాలో 15 వరకు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా సగం కాలేజీలకు న్యాక్ గుర్తింపు లేదు. ఎఐసిటిఇ నిబంధనల ప్రకారం అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు మాత్రమే బోధన సాగించాలి. పిహెచ్‌డి చేసిన ప్రిన్సిపల్ ఉండాలి. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఫీజులు వసూలు చే యాలి. చాలా కళాశాలల్లో క్వాలిఫై అధ్యాపకులు లేరు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు.

న్యాక్ గుర్తిస్తుంది ఇలా..

న్యాక్ ఉన్నత విద్యాసంస్థలను మదింపు చేసి తగిన గుర్తింపు జారీ చేస్తుంది. పాఠ్యాంశాలకు సంబంధించిన అంశాలను, బోధన, అభ్యసన, మూల్యాంకన పద్ధతులు, పరిశోధన, వినూత్న ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యార్థుల సంక్షేమం, పరిపాలన, నాయకత్వం, యాజమాన్య పద్ధతులను పరిగణలోకి తీసుకుంటారు. ఈ సంస్థ నియమించిన టీమ్ ఆయా కాలేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి 8 కేటగిరీల్లో ఏ ప్లస్,ప్లస్, ఎప్లస్, బిప్లస్, ప్లస్, బిప్లస్, బి,సి,డి గ్రేడ్లు కేటాయిస్తుంది.


వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంఎల్ఎ అశోక్

వైద్య శిబిరంలో 535 మందికి సేవలు

ప్రజాశక్తి-యానాం

యానాం చిల్డ్రన్స్ ఆడిటోరయంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి ద్వారా నాలుగవ విడత మెగా హెల్త్ క్యాంపును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి మునిస్వామి మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 535 మందికి వైద్యపరీక్షలు, కంటి పరీక్షలు చేశారు. ఇందులో సుమారు 55 మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం రాజమహేంద్రవరం పరమహంస యోగానంద నేత్రాలయ ఫౌండేషన్‌కు పంపించారు. ఉచితంగా 246 మందికి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. యానాంలో ఇలాంటి ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించడం ద్వారా ఎంతో మంది పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని స్థానికులు, ఆయ ప్రాంతాల ప్రజలు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను అభినందించారు. లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ, ఉత్థాన్ సేవా సమితి సభ్యులు శిబిరంలో సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి అధికారి సదా అన్వర్, ఆసుపత్రి ఏడి పలాస్ కుమార్ సెంధ్యాల్ ప్రజాపనులశాఖ ఇఇ వీర సెల్వం, విద్యుత్ శాఖ ఎఇ కష్ణారావు, సి.ఐ.షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిలో ముగిసిన ఇళ్ల స్థలాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్


పంపిణీలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చొల్లంగి గ్రామ పరిధిలో నిర్వహించిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. చివర రోజు కార్యక్రమానికి కమిషనర్ రమేష్ అధ్యక్షత వహించగా, ఎంపీ వంగా గీత, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మేయర్ సుంకర శివప్రసాన్న, కుడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి ముఖ్య అతిథులుగా పాల్గొని మిగిలిన లబ్ధిదారులకు పట్టాలని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా సుమారు 5000 మందికి పైగా లబ్ధిదారులకు చొల్లంగి గ్రామ పరిధిలో ఇళ్ల నిర్మాణం చేపట్టుకునేలా వారికి స్థలాలు కేటాయించి అప్పగించామన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు హరిదాసు, డిఎంహెచ్ఒ డాక్టర్ పద్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

11న దొమ్మేటి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

ఈ నెల 11వ తేదీన తాళ్ళరేవు హైస్కూల్లో తాళ్లరేవు మాజీ ఎంఎల్ఎ దొమ్మేటి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ జరగనున్న రీత్యా ఈ సభను విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద కుమార్, రాయుడు గంగాధర్ అన్నారు. ఈ సందర్భంగా తాళ్లరేవు ఎంపిపి కార్యాలయంలో దొమ్మేటి అభిమాన సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహణ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ కుమార్, గంగాధర్ మాట్లాడారు. మండలంలోని 17 పంచాయతీల్లో ప్రజలు దొమ్మేటి సంస్మరణ సభను విజయవంతం చేయడానికి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం హైస్కూల్ గ్రౌండ్లో సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు. హైస్కూల్ హెచ్.ఎం.ఆశాలతతో మాట్లాడారు. సభ విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కాశి లక్ష్మణస్వామి, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, మల్లవరం ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, అత్తిలి బాబూరావు, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆకుల వెంకన్న, బొంతు మోహన్, భూసారపు పద్మారావు, టేకుమూడి త్రిమూర్తులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో చేపలు పెంచితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - కిర్లంపూడి (జగ్గంపేట రూరల్)

కోడి వ్యర్థాలతో చేపలు పెంచితే చర్యలు తప్పవని మత్స్యశాఖ కాకినాడ అధికారి పి.వి సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం కిర్లంపూడి మండలం వీరవరం గ్రామ చేపల చెరువులను మత్స్య శాఖ అధికారులు పరిశీలించారు. చేపల పెంపకానికి కోడి వ్యర్థాలను వేస్తున్నారని గుర్తించి ఆ చేపల చెరువుల యజమానులకు నోటీసులు ఇచ్చారు. చట్టవిరుద్ధంగా చేపలు పెంచితే లైసెన్సులు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

'బంగారు కొండ'కు దాతల ఔదార్యం

కడియం : కలెక్టర్ మాధవీలత చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బంగారు కొండ పథకానికి దాతల ద్వారా మంచి స్పందన కనబడుతోంది. పోషకాహార లోపంతో బాధ పడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు వైద్యులు సూచన మేరకు మంచి మందులివ్వడమే కాకుండా పోషకాహారం అందించాల్సి వుంది. ఆయా గ్రామాల్లో గుర్తించిన ఇలాంటి పాప, బాబులకు మంచి పౌష్టికాహారం కోసం ఒక్కొక్కరికి రూ.మూడు వేలు ఆర్థిక సాయం దాతల సహకారంతో అందించేలా ఈ బంగారు కొండ పథకం రూపు దిద్దుకుంది. త్వరలో అమలు కానున్న ఈ పథకానికి దుళ్ల లో దాతల నుంచి మంచి స్పందన లభించింది. ఈ మేరకు ఒక్కో చిన్నారికి పౌష్టికాహార కిట్టు కోసం రూ.3000 చొప్పున దుళ్లలో ఐదుగురు దాతలు ముందుకొచ్చి అందించారు. గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, తోకల శ్రీనివాస్, వార్డు సభ్యుడు నామాల సుధాకర్, మాజీ ఎంపిటిసి సభ్యులు తాతపూడి పార్వతీ బాబీ, మదర్ థెరీసా సేవా సంస్థ సభ్యుడు చందన సత్తిబాబులు ఆర్థిక సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

కోనో కార్పస్ మొక్కలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పట్టణంలో ఉన్న కోనో కార్పస్ మొక్కలు

ప్రజారోగ్యానికి హానికరంగా మారుతున్న కోనో కార్పస్ మొక్కలను తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఎఐఎండిఎస్ జాతీయ అధ్యక్షుడు కాపవరపు కుమార్ మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన నూతన కమిషనర్ రామారావును కలిసి మాట్లాడారు. సామర్లకోట పట్టణంలో ప్రజా హానికరంగా ఉన్న కొనో కార్పస్ మొక్కలను తొలగించి ప్రజారోగ్యాలను కాపాడాలని కోరారు. సామర్లకోట పట్టణం, భీమవరం కొత్తపేటకు వెళ్ళే మార్గంచ ఆవాల అప్పారావు బిల్డింగ్ పక్క నుంచి సిసి రోడ్ దారిలో ప్రజా హానికరంగా ఉన్న ఈ మొక్కలు తొలగించాలన్నారు. చీకటి ప్రాంతంగా ఉన్న ప్రాంతాన్ని వెలుతురుగా చేసి, ఆ రోడ్లపై ఎటువంటి వాహనాలు రోడ్ల మధ్యలో పెట్టకుండా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిస్థితుల వల్ల ఆ ప్రాంత ప్రజలు, మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, రాత్రి సమయాల్లో రోడ్డుపై ప్రయాణించాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రధానంగా కోనో కార్పస్ మొక్కల వల్ల ప్రజలకు శ్వాసకోశ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇలా ప్రజారోగ్యాన్ని భంగం కలిగించే మొక్కలను తొలగించాలని ఆయన కోరారు. ఈ విషయంపై కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రజలకు ఇబ్బందిని కలిగించే మొక్కలను తొలగించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

సీలింగ్ భూములకు పట్టాలి ఇవ్వాలని వినతి

గోకవరం : సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు సీలింగ్ భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వాలని తహశీల్దార్‌కు ఎపి రైతుకూలి సంఘం నాయకులు విన్నవించారు. మండలంలోని కామరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలో శివరాం పట్నం గ్రామంలో 36 ఎకరాలు సీలింగ్ భూమిని 70 మంది నిరుపేద కుటుంబాలు గత 20 ఏళ్లగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని ఈ భూములకు పట్టాలు ఇవ్వాలని శుక్రవారం ఎపి రైతుకూలి సంఘం ప్రధానకార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన చేస్తూ స్థానిక తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ సీలింగ్ భూమిని రైతు కూలి సంఘం ద్వారా పోరాటాలు చేసి సాధించుకున్నామని తెలిపారు ఈ భూమిపై కన్నేసి పట్టాలు తయారుచేసి అక్రమించుకోవాలని చూస్తున్నారని తెలిపారు.

షాదిఖానా నిర్మాణంపై సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-మండపేట

ముస్లిం షాదీఖానా వద్ద వేగుళ్ల సెల్ఫీ ఛాలెంజ్

పట్టణంలో రైతు బజార్ చెంతనే ఉన్న ముస్లిం సాధిఖానా పూర్తయ్యేది ఎప్పటికని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక రైతు బజార్ వద్ద నిర్మించిన షాదీఖానా వద్ద ఆయన పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబుతో కలిసి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. అనంతరం మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.కోటితో షాదీఖానా నిర్మించామని, అయితే నిధులు సరిపోకపోవడంతో పనులు పూర్తి కాలేదన్నారు. మరో రూ.27 లక్షలమున్సిపల్ నిధులతో పనులు పూర్తి చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పటికీ ప్రభుత్వం మారిపోవడం కౌన్సిల్ సమయం ముగియడంతో పనులను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రభుత్వం అనేకమార్లు ఈ నిర్మాణం పూర్తి చేస్తానని చెబుతున్న నాలుగు సంవత్సరాల నుంచి ఈ నిర్మాణాన్ని గాలికి వదిలేసారన్నారు.

మహారాజశ్రీ 7వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు :: పెద్దాపురం

జి.ఓ.పి.నెం. 32/2023

(మైనర్ అయిన మద్దుకూరి సుదీక్ష, వయస్సు 16 సం॥లు కొరకు)

బిట్వీన్:

మద్దుకూరి వేదాస్ కృష్ణ, తండ్రి: అప్పన్న దొర, హిందువు, వయస్సు 47, డో.నెం.6-15, మొయిన్‌రోడ్, సీతంపేట, తూ॥గో॥జిల్లా. ...పిటీషనరు

అండ్

నిల్ ...రెస్పాండెంటు

పై నెంబరు గార్డియన్ ఓ.పి. గ్రంధమునందు మైనరు అయిన మద్దుకూరి సుదీక్షకు పిటీషనరు అయిన మద్దుకూరి వేదాస్ కృష్ణ గారిని గార్డియన్‌గా నియమించమని శ్రీ కోర్టు వారిని అనుమతులు కోరుచూ దాఖలు చేసిన గ్రంధముపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది.14-06-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీయొక్క అభ్యంతరములు తెలుపవలెనని ఈ జనరల్ పబ్లికేషన్ ద్వారా యావన్మందికీ తెలియజేయడమైనది.**

బల్లా నరసింహప్రసాద్
బల్లా వారి వీధి, ఇన్నీస్‌పేట, రాజమండ్రి.
సెల్: 98663 49164

తాండ్రోతు నూకరాజు
రాజమండ్రి, అడ్వకేట్, పెద్దాపురం.
29-5-23. సెల్: 98484 28172

దేవాదాయ శాఖ కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

దేవదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ శుక్రవారం కాకినాడ ధర్మదాయశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయనకు డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం దేవదాసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఖచ్చితమైన నిబద్ధతతో కార్యాలయంలో అధికారు పని చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఎం.విజయ రాజుతో కలిసి జిల్లాలో పనిచేస్తున్న 30 మంది ఇఒలతో సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ శాఖ పరిధిలో ఉన్న ఆలయాల పనితీరు, సత్రాలు పని తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఇఒలంతా పని చేయాలని దేవాదాయ శాఖలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఇవోలకు సూచించారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

చెక్కులు పంపిణీ చేస్తున్న రాఘవరావు

పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలోని 76 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి మంజూరైన రూ 63,91,000 వైఎస్ఆర్ ఆసరా చెక్కులను వైయస్సార్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీరరాఘవరావు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా సిసి తౌడు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ఈ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో 92 డ్వాక్రా గ్రూపులు ఉండగా 3వ విడత ఆసరా పథకం ద్వారా 76 గ్రూపులకు చెక్కులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లా రామాంజనేయులు, బిక్కిన సాయిరాం, ఉండమట్ల గంగాధర్, డ్వాక్రా యానిమేటర్లు భవాని, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేటలతో అవస్థలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఆలయం వద్ద ఇసుక మేటలు

మండల పరిధిలోని బలుసుతిప్ప గ్రామంలో ఒఎన్జిసి చేపడుతున్న పనులతో. అమ్మవారి ఆలయాల్లో ఇసుక మేటలు దర్శన మిస్తున్నాయి. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గోదావరి పాయల్లో పైపులైను వేస్తున్న సందర్భంగా ఇసుకను నిల్వ చేశారు, మత్స్యకారుల ఆరాధ్య దైవంగా భావించే కొత్తపేట దగ్గర వేంచేసి యున్న ధనమ్మ, కాసులమ్మ ఆలయాల్లో ఇసుక మేటలు దర్శన మివడంతో అమ్మవారి ఆలయంలో వారపు పూజలు, ప్రతి రోజు పూజలు చేసే వారికి చాల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఒఎన్‌జిసి నిర్వాహకులు కలుగ జేసుకొని అమ్మవారి ఆలయంలో ఇసుక మేటలను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 60/2020

Between:

Samudrala Venkateswara Rao, S/o. Ramayya, Hindu, aged 72 years, Business, R/o. D.No. 5-50, Main Road, Near Cheruvugattu, Ramalayam, Rajanagaram, E.G.Dist., Andhra Pradesh ***...Plaintiff***

AND

Krovvidi Khader Valli Saheb, S/o. Meera Mohiddin Basha, Teacher, aged 59 years, R.C.M. Aided High School, Alcot Gardens, Rajahmundry, East Godavari Dist., ***...Defendant***

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 26-6-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.వి.కె.రమేష్
డి.వాణి రమేష్
రాజమండ్రి 10-6-23 అడ్వకేట్స్, రాజమండ్రి

గ్రామపంచాయతీ కార్యాలయము, పాశర్లపూడిలంక

మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

రి.క. నెం.8/2023 **టెండరు ప్రకటన** **తేది.08-06-2023**

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, పాశర్లపూడిలంక గ్రామపంచాయతీకి 2023-2024 సంవత్సరమునకు ఈక్రింది షెడ్యూలు దాఖలా సామాగ్రి సప్లై చేయుటకు సీలు వేసిన టెండర్లు ఈ క్రింది సంతకం చేసిన వారిచే ది. 14-06-2023 తేది బుధవారం మధ్యాహ్నం 2.00 గం॥లు వరకు స్వీకరించబడి అదేరోజు 3.00 గం॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. టెండర్లకు ధరావత్తులకు, ఇతర వివరములకు గ్రామ పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	కాలపరిమితి	ధరావత్తు
1.	పబ్లిక్ హెల్త్ సామాన్లు, ముగ్గు, బ్లీచింగ్, ఫినాయిల్, సోడియం హైపోక్లోరైడ్ వగయిరా	1-4-2023 నుండి 31-3-2024	200/-
2.	వీధి లైట్లు విడిభాగములు	1-4-2023 నుండి 31-3-2024	100/-
3.	C.P.W.S. విడిభాగములు	1-4-2023 నుండి 31-3-2024	100/-
4.	స్టేషనరీ సామాన్లు, & ఫారములు	1-4-2023 నుండి 31-3-2024	100/-

షరతులు: ప్రజా ఆరోగ్య సామాగ్రి డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రభుత్వం వారు ఆమోదించిన రేట్లకు లోబడి సరుకు సరఫరా చేయవలెను.

శ్రీ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు
సర్పంచ్, గ్రామపంచాయతీ, పాశర్లపూడిలంక

సం/- **డి.సురేష్**
పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, పాశర్లపూడిలంక

వారధి అప్రోచ్ పనులు పూర్తి చేయరూ..

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి ఉచ్చులవారి పేట నుంచి మండల కేంద్రమైన మామిడికుదురు వెళ్లే ప్రధాన రహదారితో పాటు రేవులో శిథిల కల్వర్టు తొలగించి వంతెన నిర్మించారు. వంతెన అప్రోచ్ నుంచి కరకట్ట వరకు సుమారు 200 మీటర్ల సిసి రోడ్డు నిర్మించాల్సి ఉంది. గత ఏడాది వరదలలో జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతం సందర్శించినప్పుడు ప్రజల అవస్థలు చూసి శిథిల కల్వర్టు స్థానంలో వంతెన అవసరమని గుర్తించారు. కలెక్టర్ స్పందించి హైవే అథారిటీ వారిచే పనులు చేపట్టాలని ఆదేశించడంతో మూడు నెలలు క్రితం కల్వర్టు తొలగించి వారధి పనులు చేపట్టారు. ఈ నెలలోనే వరదల సీజన్ ప్రారంభం కానుండటంతో అప్రోచ్ పనులు ప్రారంభించక పోతే వరదలలో అవస్థలు తప్పవని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు లంక గ్రామాలకు మండల కేంద్రానికి దగ్గర మార్గమైన ఈ రహదారిలో వారధి అప్రోచ్ పనులు సకాలంలో పూర్తి చేసేలా కలెక్టం దృష్టి సారించాలని ఈ ప్రాంతవాసులు విన్నవిస్తున్నారు.

అప్పనపల్లి వారధి అప్రోచ్ రోడ్డు

పాస్‌పోర్టు పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, చెల్లూరు గ్రామానికి చెందిన ఉప్పుటూరి తనూజ్, S/o. రవికుమార్ కు చెందిన పాస్‌పోర్టు 05-06-2023వ తేదీన ఇంటి నుంచి జిరాక్స్ తీయించుకొనుటకు వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **Z6597263.** దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందజేయగలరు.

ఉప్పుటూరి తనూజ్
S/o. రవికుమార్, డోర్ నెం. 8-61
కచేరి స్ట్రీట్, చెల్లూరు
రాయవరం మండలం - 533261
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 9160499666

గ్రామపంచాయతీ కార్యాలయము, పెదపట్నంలంక

మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

రి.క. నెం.8/2023 **టెండరు ప్రకటన** **తేది.08-06-2023**

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, పెదపట్నంలంక గ్రామపంచాయతీకి 2023-2024 సంవత్సరమునకు ఈక్రింది షెడ్యూలు దాఖలా సామాగ్రి సప్లై చేయుటకు సీలు వేసిన టెండర్లు ఈ క్రింది సంతకం చేసిన వారిచే ది. 14-06-2023 తేది బుధవారం మధ్యాహ్నం 2.00 గం॥లు వరకు స్వీకరించబడి అదేరోజు 3.00 గం॥లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. టెండర్లకు ధరావత్తులకు, ఇతర వివరములకు గ్రామ పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	కాలపరిమితి	ధరావత్తు
1.	పబ్లిక్ హెల్త్ సామాన్లు, ముగ్గు, బ్లీచింగ్, ఫినాయిల్, సోడియం హైపోక్లోరైడ్ వగయిరా	1-4-2023 నుండి 31-3-2024	200/-
2.	వీధి లైట్లు విడిభాగములు	1-4-2023 నుండి 31-3-2024	100/-
3.	C.P.W.S. విడిభాగములు	1-4-2023 నుండి 31-3-2024	100/-
4.	స్టేషనరీ సామాన్లు, & ఫారములు	1-4-2023 నుండి 31-3-2024	100/-

షరతులు: ప్రజా ఆరోగ్య సామాగ్రి డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రభుత్వం వారు ఆమోదించిన రేట్లకు లోబడి సరుకు సరఫరా చేయవలెను.

శ్రీ సుందరనీడి రాజేష్‌కుమార్
సర్పంచ్, గ్రామపంచాయతీ, పెదపట్నంలంక

సం/- **డి.సురేష్**
పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, పెదపట్నంలంక